రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

అంబేద్కర్ నగర్ పీహెచ్‌సీలో ఫార్మసీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 4 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని 12వ వార్డులోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఔషధాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మందుల కొరత లేకుండా చూసుకోవాలని చెప్పారు. పాము, కుక్క కాటుకు మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన పలువురితో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ వెంట డాక్టర్ రమ్య, సిబ్బంది సంధ్య, కృష్ణప్రియ, ధనమ్మ ఉన్నారు. అదేవిధంగా తిలక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

డేటా ఎంట్రీకి 489 బృందాలు

సూర్యాపేట, జనవరి 4 : ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీకి 489బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి డేటా ఎంట్రీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డేటా ఎంట్రీ విధి విధానాలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దిరాల : కుక్కడం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మఠంపల్లి : గుర్రంబోడులో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభిస్తున్న ఎంపీపీ పార్వతి

- ఎమ్మెల్యే మందుల సామేల్
- జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

మద్దిరాల / నూతనకల్ / తిరుమలగిరి, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల కోసం నియోజకవర్గంలో అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. మద్దిరాల మండలంలోని కుక్కడం గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్, ఎంపీపీ గుడ్ల ఉపేంద్రావెంకన్న, తాసీల్దార్ అమీన్‌సింగ్, సర్పంచ్ గుండ్ల కొమరయ్య, ఎంపీటీసీ ముక్కాల అవిలమల్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ పాల్గొన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎంపీపీ భూరెడ్డి కళావతి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి పాల్గొన్నారు. తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చివ్వెంల / పెన్‌పహాడ్ /ఆత్మకూర్.ఎస్ / తుంగతుర్తి / అర్వపల్లి : అభయ హస్తం ఆరు గ్యారెంటీలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్‌లో ప్రజా పాలనను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మి, డీటీ ఝాన్సీ, ఎంపీఓ గోపి, సర్పంచులు కృష్ణ, కరుణ, గురువేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పెన్‌పహాడ్ మండలంలోని చీదెళ్ల, తంగెళ్లగూడెం, లింగాల, దూపాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాలను జడ్పీ సీఈఓ సురేశ్, మండల ప్రత్యేక అధికారి రాంపతి పరిశీలిచారు. ఆత్మకూర్.ఎస్, తుంగతుర్తి, అర్వపల్లి మండలాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు.

పాలకవీడు / మేళ్లచెర్వు/ మఠంపల్లి / నేరేడుచర్ల / గరిడేపల్లి / మోతె : పాలకవీడు మండలంలోని గుండెబోయినగూడెం గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణకు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. మేళ్లచెర్వు మండలంలోని కప్పలకుంట తండా, వెల్లటూరు గ్రామ పంచాయతీల్లో ప్రజాపాల దరఖాస్తులను ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు స్వీకరించారు. మఠంపల్లి మండలంలోని రామచంద్రాపురం, సుల్తాన్‌పురం తండా, కృష్ణ తండా, గుర్రంబోడు తండాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా నేరేడుచర్ల, గరిడేల్లి, మోతె మండలాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

మద్దిరాలలో శివలింగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మద్దిరాల, జనవరి 4 : మండలంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సంగాని మహేశ్ కుమారుడు ఉమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అదే గ్రామానికి చెందిన పొట్టబత్తుల శ్రీనివాస్ సతీమణి సత్యవతి చనిపోయారు. అలాగే మద్దిరాల మాజీ ఎంపీటీసీ గూడ అన్నమ్మ భర్త శివలింగారెడ్డి, రామచంద్రాపురం సర్పంచ్ వెలుగు వెంకన్న తండ్రి మరణించారు. గురువారం ఆయా కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించారు. మృతుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, జడ్పీటీసీ కన్న సురాంబవీరన్న, సూరినేని నర్సింహారావు, దామెర్ల వెంకన్న, లావుడ్య వెంకన్న, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, పాతూరి లింగారెడ్డి, భూసాని ఉమామహేశ్వర్, పాలబిందెల శ్రీనివాస్, గుండ్ల నాగయ్య, మల్యాల నర్సయ్య, బీఎస్ ముదిరాజ్, కొలగాని వెంకన్న ఉన్నారు.

విధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడ టౌన్, జనవరి 4 : అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ సూర్యనారాయణ సూచించారు. పట్టణంలోని శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రం-3ను గురువారం ఆయన తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, పౌష్టికాహారం నమోదు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే శానంపూడి పరామర్శ

వెంకన్నను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు, జనవరి 4 : బీఆర్‌ఎస్ మండల నాయకుడు, బొత్తలపాలెం గ్రామానికి అందె వెంకన్న ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలసిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం వెంకన్న ఇంటికి వెళ్లి అతడిని పరామర్శించారు. ప్రమాద వివరాలను ఆరా తీసి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను గెలిచినా, ఓడినా ఎల్ల వేళలా నియోజక వర్గ ప్రజలకు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేండ్ల శ్రీధర్, పీపీసీఎస్ చైర్మన్ యరెడ్ల సత్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ బోగాల వీరారెడ్డి, నాయకులు దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, చెన్నబోయిన సైదులు, లక్ష్మీనారాయణ, అందె వెంకటయ్య, రామినేని వెంకయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

- జడ్పీ సీఈఓ సురేశ్, డీఈఓ అశోక్

అర్వపల్లి : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఏఓ రామారావునాయక్

పెన్‌పహాడ్, జనవరి 4 : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు, అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యంగా అందించాలని లేకపోతే చర్యలు తప్పవని జడ్పీ సీఈఓ సురేశ్, డీఈఓ అశోక్ అన్నారు. గురువారం మండలంలోని చీదెళ్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను జడ్పీ సీఈఓ, అలాగే అనంతారం, సింగారెడ్డిపాలెం ప్రైమరీ స్కూల్‌ను డీఈఓ అశోక్, లింగాల అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేక అధికారి రాంపతి వేర్వేరుగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు రిజిస్టర్‌ను, మధ్యాహ్న భోజనాన్ని, పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.

కోడూరు పాఠశాల తనిఖీ

అర్వపల్లి : మండలంలోని కోడూరు మండల ప్రాథమికోన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి, డీఏఓ రామారావు నాయక్ పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ బాబు, ఏఈ శశిదర్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రభాకర్, కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

'నిరుపేద మహిళలకు చీరల పంపిణీ అభినందనీయం'

కోదాడ, జనవరి 4 : నిరుపేద క్రిస్టియన్ మహిళలకు చీరల పంపిణీ అభినందనీయమని సీనియర్ రాజకీయ నాయకుడు ఎర్నేని వెంకటరత్నంబాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌడం హనుమంతరావు తన సొంత ఖర్చుతో మండలంలోని ద్వారకుంట గ్రామ చర్చిలో క్రిస్టియన్ మహిళలకు బుధవారం చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సామినేని ప్రమీల, ఉపసర్పంచ్ జబ్బార్, గ్రామశాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ గద్దె నరేందర్, మాజీ సర్పంచ్ గద్దల వెంకటేశ్వర్లు, పాలకి సురేశ్, బీమాల బ్రహ్మం, బూరెల కరుణాకర్, సొందు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వెంచర్

- టిప్పర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఆత్మకూర్.ఎస్, జనవరి 4 : మండలంలోని పాతర్లపహాడ్ స్టేజీ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 30 ఎకరాల్లో భారీ వెంచర్ ఏర్పాటు అవుతున్నది. భూమిని కన్వర్షన్ చేయకుండానే నిర్వాహకులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. గ్రామ పంచాయతీకి కూడా కనీస సమాచారం లేకుండా ఖమ్మంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థానిక రాజకీయ నాయకుల అండతో వెంచర్ ఏర్పాటుకు పూనుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో వెంచర్‌కు టిప్పర్లతో మట్టిని తరలిస్తుండగా కందగట్ల గ్రామవాసులు రోడ్లు పాడవుతున్నాయంటూ పేర్కొంటూ గురువారం టిప్పర్లను అడ్డుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో తాసీల్దార్ కృష్ణయ్య, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తాసీల్దార్ తెలిపారు. ఈ విషయమై తాసీల్దార్, సర్పంచ్‌ను వివరణ కోరగా వెంచర్ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు.

బొత్తలపాలెం ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

బొత్తలపాలెం ప్రాథమిక పాఠశాలను ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

పాలకవీడు, జనవరి 4 : మండలంలోని బొత్తలపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలను హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తయారు చేసిన రాగిజావను స్వయంగా అందించారు. మధ్యాహ్న భోజన మెనూ, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించి బోధనా సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మన ఊరు – మన బడి పథకంలో పూర్తైన పనులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపాల్, హెచ్‌ఎం శ్రీనయ్య పాల్గొన్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి

- సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య



కోదాడలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య

కోదాడ, జనవరి 4 : ప్రతిఒక్కరూ వయోవృద్ధులను గౌరవించాలని సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంపై నిర్మించిన సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నవ మాసాలు కష్టపడి కని పెంచిన పిల్లలు వృద్ధాప్యంలో తమను చూసుకోవడం లేదంటూ ఎందరో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. వయోవృద్ధుల చట్టాలపై ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, స్థానిక కౌన్సిలర్ కొల్లా ప్రసన్నలక్ష్మి, కోటిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు, ఎం.వెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్, హమీద్ ఖాన్, చిగురుపాటి వరప్రసాద్, రఘువరప్రసాద్, భ్రమరాంబ, శోభ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో రాణించిన విద్యార్థికి అభినందన

బొడ్రాయిబజార్, జనవరి 4 : గడిచిన డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో రంగారెడ్డిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అండర్-17 టోర్నమెంట్‌లో సూర్యాపేట జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహించిన సూర్యాపేటకు చెందిన రాహుల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ కారింగుల బాలాగౌడ్ ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థిని సన్మానించి అభినందనలు తెలిపారు.

పస్తాల స్టేజీ వద్ద భూమి పూజ చేసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

నాగారం, జనవరి 4 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీటీసీ బండగొర్ల నరేశ్, బొజ్జ సైదులు అన్నారు. గురువారం నాగారం మండలం తుంగతుర్తి నాగారం రహదారిపై పస్తాల స్టేజీ వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిత్తలూరి రమేశ్‌గౌడ్, పులుసు శేఖర్, కండె విక్రమ్, వెంకన్న, కండె అంజయ్య, బొజ్జ శ్రీను, అశోక్, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీకి పేర్లు నమోదు చేసుకోవాలి

- ఎంఈఓ రాములునాయక్

విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ కృష్ణ

నూతనకల్, జనవరి 4 : ఫిజియోథెరపీ కోసం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గురువారం ఫిజియోథెరఫిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం ఎమ్మార్సీ భవనంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, ఉపాధ్యాయులు రేపాక లింగయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

అర్వపల్లి, జనవరి 4 : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అడివెంల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మంగ రవి (38) గురువారం తాటి చెట్టు ఎక్కి కిందకు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రవికి భార్య, కుమారుడు ఉన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

సంక్షేమ పథకాల సద్వినియోగంతో జీవన ప్రమాణాలు మెరుగు

- కేవీకే శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి, జనవరి 4 : ప్రభుత్వ సంక్షేమ పథకాల సద్వినియోగంతోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త అరిగెల కిరణ్ అన్నారు. మండలంలోని ఎల్‌బీనగర్, కోదండరామాపురం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై డిజిటల్ వీడియోల ద్వారా గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, సంక్షేమ పథకాల వల్ల కలిగిన ప్రయోజనాల గురించి వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను రూపొందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా వ్యవసాయ సంబంధిత సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అనంతరం ఏపీజీవీబీ గరిడేపల్లి మేనేజర్ గోరంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పనకు అనేక రకాల రుణాలు అందిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో హెల్త్, మెడికల్, పోస్టల్, అంగన్‌వాడీ, సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, నాయకులు

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

- ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 4 : గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అంతకు ముందు తమ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గొర్రెల యూనిట్లకు డీడీలు చెల్లించిన వారికి గొర్రెలు అందించాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధికారి విద్య బాలల హక్కులు, వాటి పరిరక్షణపై వివరించారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో వారిని మండల పరిషత్ తరపున సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ దేవిక, గుడిపల్లి తాసీల్దార్ శ్రావణ్, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నడిగూడెం, జనవరి 5 : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని తెలిపారు. రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పాఠశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విరాళం అందజేత

నడిగూడెం, జనవరి 4 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న భోజనశాల నిర్మాణానికి ఖమ్మం జిల్లా సాత్రాయి గ్రామానికి చెందిన సిర్పం సందీప్‌రెడ్డి, ప్రియాంకరెడ్డి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు గురువారం రూ.25వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాయిబాబా ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అడవిదేవులపల్లి/ దామరచర్ల/మాడ్గుల పల్లి, జనవరి 4 : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలతో పాటు దామరచర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో, మాడ్గులపల్లి మండలంలోని చెర్వుపల్లి, మాడ్గులపల్లి, ఇందుగుల, ఆగామోత్కూర్, పాములపాడు జడ్పీహైస్కూల్‌తోపాటు కుక్కడంలోని కేజీబీవీ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వేములపల్లి మండలం రావులపెంట, వేములపల్లి, శెట్టిపాలెం, సల్కునూరు, ఆమనగల్లు ఉన్నత పాఠశాలలతోపాటు వేములపల్లి కేజీబీవీలో కూడా అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఫౌండేషన్ సభ్యులు మెండె వెంకట్, అంబటి శ్రీనివాస్, ఎలకపల్లి మహేశ్, కంచర్ల రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు అబ్బాస్, నాగలక్ష్మి, పిచ్చయ్య, విజయ, సునీత, భూపాల్‌రెడ్డి, శేషగిరి, లక్ష్మారెడ్డి, వేణుగోపాలస్వామి, రమేష్, సత్యనారాయణ, యోగేశ్వరచారి, ఇంతియాజ్, కేజీబీవీ ఎస్‌ఓ అరుణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 4: విద్యారంగ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కోర్టులో ఉన్న కేసులు సత్వరమే పరిష్కరించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, సభ్యులు బక్కా శ్రీనివాసచారి, మొర్తాల శ్రీనివాస్‌రెడ్డి, అడావత్ చిన వెంకన్న, చంద్రశేఖర్, వేదశ్రీ, కట్ల మధుసూదన్, పాల్వాయి శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, సామ సైదులు, శివ, నాగయ్య, పులి సత్యనారాయణ, శ్యామ్‌కుమార్, కోటానాయక్, నెహ్రూ, ప్రశాంతి, హరిణి పాల్గొన్నారు.

గ్రామ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వేములపల్లి : మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో, మండల కేంద్రంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, సర్పంచులు మజ్జిగపు పద్మ, చిర్ర మల్లయ్య యాదవ్, ఎంపీటీసీలు పల్లా వీరయ్య, చల్ల బొట్ల చైతన్య, ఎంపీడీఓ జానయ్య, డీటీ నిర్మలాదేవి, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల డిజిటలైజేషన్‌పై అవగాహన

అడవిదేవులపల్లి, జనవరి 4 : ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్లకు బుధవారం మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి పి.శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ఈ నెల 6న ముగుస్తుందని, ఇంకా ఎవరైనా దరఖాస్తు ఇవ్వని వారు రెండు రోజుల్లో అధికారులకు అందించాలని సూచించారు.

త్వరలోనే కస్తూర్బా పాఠశాల భవనం ప్రారంభం

- ఎంపీపీ అనుముల పాండమ్మ

త్రిపురారం, జనవరి 4: మండలంలోని కంపసాగర్ మోడల్‌స్కూల్ ఆవరణలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని ఈ నెలాఖరుకు ప్రారంభిస్తామని ఎంపీపీ అనుముల పాండమ్మ తెలిపారు. గురువారం పాఠశాల భవనాన్ని జడ్పీటీసీ భారతీభాస్కర్‌నాయక్, ఎంఈఓ బాలాజీనాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొత్త భవన నిర్మాణం పూర్తయినందున పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు పెంచడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎంఈఓకు సూచించారు. వారి వెంట ముడిమల్ల బుచ్చిరెడ్డి, పాఠశాల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఏఈ రవీందర్‌రెడ్డి ఉన్నారు.